12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 10 సంచిక :13 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 18 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME 10 ISSUE :13 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 18 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

## కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం



- రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన
- ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్
- రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని

- మిగతా 2లో



# దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీకి అండగా నిలవాలి

- వారణాసిలో చంద్రబాబు ప్రసంగానికి జేజేలు.. "వెరీ వెల్" అంటూ రాజ్‌నాథ్ ప్రశంస
- VKS మంత్రంతో భారత్ అభివృద్ధి ప్రస్థానం అన్‌స్టాపబుల్ అని వ్యాఖ్య
- అయోధ్యలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని యూపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి
- చంద్రబాబు ప్రసంగానికి వారణాసిలో విశేష స్పందన, చప్పట్లతో మార్మోగిన సభా ప్రాంగణం
- ప్రధానిగా మోదీ 25 ఏళ్ల ప్రస్థానం సందర్భంగా వారణాసిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగితో కలిసి పూజలు
- స్వామివారికి పవిత్ర జలాలతో అభిషేకం చేసి, భక్తులకు ప్రసాదం పంపిణీ
- చంద్రబాబు వెంట టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, సానా సతీష్



**పెన్ పవర్ డెస్క్:**"ప్రధాని నరేంద్ర మోదీ సరైన సమయంలో సరైన నాయకుడు (రైట్ టైమ్.. రైట్ లీడర్). ఆయన నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, కేవలం దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీకి మనమందరం అండగా నిలవాలి. ఎన్డీయే ఐక్యతే ఈ దేశానికి బలం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం, ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని వారణాసిలో మంగళవారం నిర్వహించిన 'వారణాసి-వాద్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య

- మిగతా 2లో

# ఆస్ట్రేలియాలో ఘోర రోడ్డు ప్రమాదం.. విశాఖకు చెందిన ఇద్దరు మహిళలు మృతి

- ఆస్ట్రేలియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖకు చెందిన ఇద్దరు మహిళలు మృతి
- మృతులు వీడీసీఏ మాజీ అధికారి జీటీ ప్రసాద్ భార్య, కోడలు
- కుటుంబ వేడుక కోసం ఆస్ట్రేలియా వెళ్లగా మెల్బోర్న్‌లో ఘటన
- కళ్లెదుటే ప్రమాదం జరగడంతో తీవ్ర దిగ్భ్రాంతిలో జీటీ ప్రసాద్
- పది రోజుల్లో మృతదేహాలు విశాఖకు చేరుకునే అవకాశం - మిగతా 2లో






## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు: జగన్ పై అనిత ఫైర్

- డీఎస్సీ నియామకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అనిత మండిపాటు
- డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత బురద చల్లుతున్నారని ఆగ్రహం
- వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుసని వ్యాఖ్య

- మిగతా 2లో

## ప్రధాని మోదీ పుట్టినరోజు.. 'ఆశీర్వాద దీపం' వెలిగించిన నారా లోకేశ్

- ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు శుభాకాంక్షలు
- ఉండవల్లిలోని తన నివాసంలో 'ఆశీర్వాద దీపం' వెలిగించిన లోకేశ్
- మోదీకి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థన
- మోదీ నాయకత్వంలో దేశం వికసిత భారత్ వైపు సాగుతోందని ప్రశంసలు

- మిగతా 2లో





## వైసీపీ మాజీ ఎమ్మెల్యే గనులపై మైనింగ్ శాఖ దాడి..

### క్వారీ యంత్రాలు, వాహనాలు స్వాధీనం

- అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలో కాపు రామచంద్రారెడ్డి మైనింగ్
- నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ చేస్తున్నారని ఫిర్యాదులు
- పొక్లెయిన్లు, రవాణా వాహనాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

- మిగతా 2లో

### ఆర్థిక వృద్ధిలో రికార్డ్.. సెమీకండక్టర్ రంగంలో దూకుడు..

# భారత్‌పై ప్రపంచానికి విశ్వాసం పెరుగుతోంది

- సెమీకాన్ ఇండియా 2026ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- భారత్ ఆర్థిక వృద్ధి, ప్రపంచ విశ్వాసానికి సెమీకండక్టర్ల రంగం నిదర్శనమని వ్యాఖ్య
- ప్రపంచమంతా భారత చిప్స్ వెళతాయని ధీమా వ్యక్తం చేసిన మోదీ
- సెమీకాన్ 2.0 కింద 200 చిప్-డిజైన్ స్టార్టప్‌లకు మద్దతిస్తామని వెల్లడి
- నాలుగేళ్లలోనే 70,000 మంది డిజైన్ ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చామన్న అశ్విని వైష్ణవ్

- మిగతా 2లో



### తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు..

## ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల
- మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ
- సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన

- మిగతా 2లో

**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ



## 'మీ మనస్తత్వం మార్చుకోండి.. హిందీని వద్దంటే కుదరదు'



### విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు

- తమిళనాడులో హిందీ బోధించకపోవడం కుదరదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- నవోదయ స్కూళ్ల కోసం జిల్లాలవారీగా స్థలాలు గుర్తించాలని ఆదేశం
- స్థలాల గుర్తింపునకు తమిళనాడు ప్రభుత్వానికి మూడు నెలల గడువు
- త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తూ పాఠశాలలను అడ్డుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచన

- మిగతా 2లో

## నిజామాబాద్‌లో యూట్యూబర్ వైష్ణవి భర్త హత్య



- కొబ్బరి బొండాల కత్తితో దాడి చేసి చంపిన వ్యక్తి
- భార్య వైష్ణవి హత్య కేసులో హరిబాబు గతంలో నిందితుడు
- పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని పోలీసుల అనుమానం
- ఈ దాడిలో ముగ్గురు పాల్గొన్నట్లు ప్రాథమికంగా గుర్తింపు


**పెన్ పవర్ డెస్క్:**నిజామాబాద్ నగరంలో పట్టపగలే యూట్యూబర్ భర్త హత్య జరిగింది. యూట్యూబర్ వైష్ణవి భర్త చిట్టారి హరిబాబు (26)ను గుర్తుతెలియని వ్యక్తి కిరాతకంగా నరికి చంపాడు. నగరంలోని రాజరాజేంద్ర చౌరస్తా వద్ద ఈ ఘోరం జరిగింది. పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హరిబాబుపై ఓ వ్యక్తి కొబ్బరి

- మిగతా 2లో

### మావోయిస్టులకు భారీ దెబ్బ..

## రూ.2.20 కోట్ల రివార్డు ఉన్న అగ్రనేత లొంగుబాటు

- మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అసిమ్ మండల్ లొంగుబాటు
- జార్ఖండ్, ఒడిశాలలో కలిపి ఇతనిపై రూ.2.20 కోట్ల రివార్డు
- పలు హింసాత్మక ఘటనల్లో కీలక పాత్ర పోషించిన అసిమ్
- మండల్ నుంచి కీలక సమాచారం రాబట్టేందుకు అధికారుల ప్రయత్నం



- మిగతా 2లో




## మోడీ జీవితంలో అరుదైన రికార్డ్స్

సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో మొదటిది ఢిల్లీతో సహా పలు రాష్ట్రాల్లో 'సేవా సంకల్ప అభియాన్' (సేవా సంకల్ప ఉద్యమం). ఈ సందర్భంగా రోడ్లు, మురుగునీటి పారుదల, విద్య, విద్యుత్ వంటి పలు ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని, ఢిల్లీలోని 'దర్భవాయి మార్గం' (కర్తవ్య మార్గం) వెంబడి 1.25 లక్షల ఆశీర్వాద దీపాలను వెలిగించారుప్రధాని మోదీ రాజకీయ జీవితం విషయానికి వస్తే, ఆయన అక్టోబర్ 2001 నుండి మే 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2014 నుండి భారతదేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2014లో లోక్‌సభ ఎన్నికలలో గెలిచి ఆయన తొలిసారి ప్రధానమంత్రి అయ్యారు. ఈ పరంపర ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి చెందిన కొన్ని ముఖ్యమైన రికార్డులు, విజయాలను పరిశీలిద్దాం.

**ప్రధాని మోదీకి చెందిన 5 పెద్ద రికార్డులు:**

వరుసగా అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రి రికార్డు: 2026 జూన్ 10న, ప్రధానమంత్రి మోదీ వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా పనిచేసి, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 4,398 రోజుల రికార్డును అధిగమించారు. దీంతో ఆయన అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రి అయ్యారు.ప్రభుత్వాధినేతగా సుదీర్ఘ పదవీకాలం: 7 అక్టోబర్ 2001న నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా మొత్తం సుమారు 25 సంవత్సరాల పాటు ప్రభుత్వాధినేత పాత్రను పోషించారు.వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికలలో విజయం: 2014 నుండి నరేంద్ర మోదీ వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికలలో తన పార్టీ, కూటమికి నాయకత్వం వహించారు. ఈ ఎన్నికల తరువాత ఆయన వరుసగా మూడవసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీంతో లోక్‌సభలో ఆయనకు ఇది వరుసగా మూడవ విజయం.గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డు: నరేంద్ర మోదీ అక్టోబర్ 2001 నుండి మే 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఈ కాలంలో, ఆయన నాయకత్వంలో బీజేపీ రాష్ట్రంలో వరుస ఎన్నికల విజయాలను సాధించింది.విదేశీ పురస్కారాల రికార్డు: ప్రధానమంత్రి మోదీ వివిధ దేశాల నుండి 30కి పైగా ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నారు. విదేశాల నుండి ఒక భారత ప్రధానమంత్రికి లభించిన అత్యధిక విదేశీ పురస్కారాలు ఇవే. వీటిలో సియోల్ శాంతి బహుమతి, ఫిలిప్ కోట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డు, ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డు (ఆఫ్ఘనిస్తాన్ అత్యున్నత పౌర పురస్కారం), సౌదీ అరేబియా రెండవ అత్యున్నత పౌర పురస్కారం, ఈజిప్ట్ అత్యున్నత పౌర పురస్కారం వంటివి ఉన్నాయి.

## రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం

- మొదటి పేజి తరువాయి

జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.
సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

## ఆస్ట్రేలియాలో ఘోర రోడ్డు ప్రమాదం.. విశాఖకు చెందిన ఇద్దరు మహిళలు మృతి

విశాఖపట్నానికి చెందిన ఒకే కుటుంబంలోని ఇద్దరు మహిళలు ఆస్ట్రేలియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. మెల్బోర్న్ నగరంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన విశాఖలో తీవ్ర విషాదఛాయలు నింపింది.విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (వీడీసీఏ) మాజీ సంయుక్త కార్యదర్శి జీటీ ప్రసాద్ ఇటీవల తన భార్యతో కలిసి ఆస్ట్రేలియా వెళ్లారు. అక్కడ జరుగుతున్న ఒక కుటుంబ వేడుకలో పాల్గొనేందుకు వారు మెల్బోర్న్ చేరుకున్నారు. ఈ క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో జీటీ ప్రసాద్ భార్యతో పాటు ఆయన కోడలు నేహా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు.
అత్యంత విషాదకరమైన విషయమేమిటంటే, ఈ ప్రమాదం జీటీ ప్రసాద్ కళ్లెదుటే జరిగింది. ఈ ఘటనతో ఆయన తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వేడుక కోసం ఎంతో ఆనందంగా వెళ్లిన ఆ కుటుంబంలో ఈ ప్రమాదం తీరని శోకాన్ని మిగిల్చింది. మృతదేహాలను స్వస్థలానికి తరలించే ప్రక్రియ కొనసాగుతోందని, సుమారు 10 రోజుల్లో అవి విశాఖకు చేరుకుంటాయని బంధువులు వెల్లడించారు.

## తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

- మొదటి పేజి తరువాయి

స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది.ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు.
ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

# దేశ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీకి అండగా నిలవాలి

- మొదటి పేజి తరువాయి

అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమం నుంచి సాంకేతికత వరకు చోటుచేసుకున్న విప్లవాత్మక మార్పులను సమగ్రంగా వివరించారు.

**VKS మంత్రంతో అభివృద్ధి**

కాశీ క్షేత్రం ప్రధాని మోదీకి కర్మభూమి అని, ఇక్కడి ప్రజలు కేవలం తమ ఎంపీని మాత్రమే కాక, దేశానికి ఓ గొప్ప నాయకుడిని అందించారని చంద్రబాబు అన్నారు. "VKS (వాద్‌నగర్, కాశీ, సెప్టెంబర్) అనేది నేటి భారత అభివృద్ధి మంత్రం. ప్రధాని మోదీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందుతున్నాయి. జల్ జీవన్ మిషన్, అమృత్ వంటి పథకాలతో 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కలిగింది. పీఎం కిసాన్ పథకం ద్వారా 11 కోట్ల మంది రైతులకు మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి నగదు అందుతోంది," అని వివరించారు. కరోనా మహమ్మారి సమయంలో 200 కోట్ల వ్యాక్సిన్ డోసులు ఉత్పత్తి చేయించి, 140 కోట్ల మంది ప్రజలను కాపాడటమే కాకుండా, 101 దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్లు అందించి మోదీ మానవత్వాన్ని చాటారని కొనియాడారు.

**టెక్నాలజీ నుంచి జాతీయ భద్రత వరకు**

ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి విధానాలతో ఒకప్పుడు రక్షణ పరికరాలు దిగుమతి చేసుకునే భారత్, ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరిందని చంద్రబాబు తెలిపారు. "టెక్నాలజీని పూర్తిస్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీ. స్పేస్, డ్రోన్, క్వాంటం, సెమీ కండక్టర్ టెక్నాలజీలతో యువతకు ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నారు. ఆయన దూరదృష్టితో దేశంలో 2.20 లక్షల స్టార్టప్‌లు ఏర్పాటయ్యాయి. యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగారు," అని అన్నారు. మహిళా సాధికారతకు 'భేటీ బచావో-భేటీ పడావో', 'లఖ్‌పతీ దీదీ' వంటి పథకాలతో పాటు, చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించే 'నారీ శక్తి అధినియమ్' ఒక గేమ్ ఛేంజర్ కాబోతోందని అభిప్రాయపడ్డారు. దేశ భద్రత విషయంలో మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రశంసిస్తూ, "ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారు. దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని దాదాపు అంతమొందించారు. దానికి నేనూ ఒక బాధితుడినే. నక్సలైట్లు నన్ను టార్గెట్ చేశారు. కానీ మోదీ పాలనలో దేశం సురక్షితంగా ఉంది" అని చంద్రబాబు గుర్తుచేశారు.

**భవిష్యత్ ప్రణాళికలు, అయోధ్యలో శ్రీవారి ఆలయం**

దేశంలో నదుల అనుసంధానం కేవలం ప్రధాని మోదీతోనే సాధ్యమవుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "బ్రహ్మపుత్ర, గంగ, మహానది, గోదావరి, కావేరి నదులను అనుసంధానిస్తే భారత్ అభివృద్ధి అన్‌స్టాపబుల్ అవుతుంది," అని ఆయన అన్నారు. శతాబ్దాల కల అయిన అయోధ్య రామమందిర నిర్మాణాన్ని మోదీ నిజం చేశారని ప్రశంసించారు. ఈ సందర్భంగా, "త్రేతాయుగ దైవమైన శ్రీరాముని జన్మస్థలం అయోధ్యలో, కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని భావిస్తున్నాం. ఇందుకు 10 ఎకరాల భూమి కేటాయించాలి" అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను వేదికపైనే కోరారు.

**ప్రసంగానికి విశేష స్పందన**

'ఆజ్ మే కాశీకే పవిత్ర ధర్తీ పర్ ఖడా హూ' అంటూ హిందీలో ప్రసంగాన్ని ప్రారంభించిన చంద్రబాబు, సభికులను తన ప్రసంగంలో భాగస్వాములను చేస్తూ ముందుకు సాగారు. 'దేశ్ బదల్ రహా హై, దేశ్ ఆగే బఢ్ రహా హై' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు సభికుల నుంచి పెద్ద ఎత్తున చప్పట్లు, హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. చంద్రబాబు ప్రసంగం ముగిశాక రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా స్పందిస్తూ, "చంద్రబాబు చాలా అద్భుతంగా మాట్లాడారు.. వెరీ వెల్.. వెరీ వెల్" అని ప్రశంసించి, ఆయనకు అభినందనగా చప్పట్లు కొట్టాలని సభికులను కోరారు. దీంతో రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్ మొత్తం కరతాళ ధ్వనులతో మార్మోగింది. కార్యక్రమానికి ముందు చంద్రబాబు, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి కాశీ విశ్వనాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 'సేవా సంకల్ప్ యాత్ర'ను జెండా ఊపి ప్రారంభించారు

# 'మీ మనస్తత్వం మార్చుకోండి.. హిందీని వద్దంటే కుదరదు'

జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. "తమిళనాడు గడ్డపై హిందీ బోధించబోమని చెప్పడం కుదరదు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలల స్థాపనకు అవసరమైన స్థలాలను గుర్తించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని సూచించింది.
జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేస్తూ, "మీరు మీ మనస్తత్వాన్ని మార్చుకోవాలి. నవోదయ విద్యాలయాలు కేంద్రం ఇస్తోంది.. వీటి వల్ల తమిళనాడు ప్రమాణాలేమీ తగ్గిపోవు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మెలగాలి. ఢిల్లీ ప్రజలు చెన్నై వారిని, అలాగే చెన్నై ప్రజలు ఢిల్లీ వారిని దూరం చేసుకోకూడదు" అని హితవు పలికింది. నవోదయ పాఠశాలల ఏర్పాటు ద్వారా తమిళనాడులో విద్యావకాశాలు మరింత మెరుగుపడతాయని కోర్టు అభిప్రాయపడింది.

**వివాదం నేపథ్యం ఇదే**

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే నవోదయ విద్యాలయాలు త్రిభాషా సూత్రాన్ని (హిందీతో సహా) అనుసరిస్తాయి. అయితే, తమిళనాడులో ద్విభాషా విధానం అమలవుతుండటంతో, హిందీని తప్పనిసరి చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది తమ విద్యా విధానానికి విరుద్ధమని వాదిస్తోంది. అంతేకాకుండా, ఇది ఒక ఐచ్ఛిక పథకమని, దీనిని కచ్చితంగా అమలు చేయాలని న్యాయస్థానం ఆదేశించలేదని పేర్కొంటోంది.ఈ నేపథ్యంలో, ప్రతి జిల్లాలో ఆరు వారాల్లోగా స్థలాలను గుర్తించాలని 2025 డిసెంబర్ 15న సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని తమిళనాడు ప్రభుత్వం కోరగా, ధర్మాసనం అందుకు నిరాకరించింది. స్థలాల గుర్తింపు కోసం మరో మూడు నెలల గడువు ఇస్తూ, తదుపరి విచారణను డిసెంబర్ 14కి వాయిదా వేసింది. అయితే, తక్షణమే భూసేకరణ చేయాలని తాము చెప్పడం లేదని, కేవలం అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని మాత్రమే ఆదేశిస్తున్నామని కోర్టు స్పష్టం చేసింది. భాషా విధానంపై నెలకొన్న సమస్యలను కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించింది.

## ఆర్థిక వృద్ధిలో రికార్డ్.. సెమీకండక్టర్ రంగంలో దూకుడు.. భారత్‌పై ప్రపంచానికి విశ్వాసం పెరుగుతోంది

ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దేశంపై అంతర్జాతీయ విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ వంటి కీలక రంగాల్లో చోటుచేసుకుంటున్న అభివృద్ధి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం సెమీకాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రసంగించారు.ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ప్రపంచం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇటీవలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. ఇది మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను చూపుతోంది. గడిచిన 15 రోజుల్లో జరిగిన పరిణామాలే దీనికి ఉదాహరణ" అని తెలిపారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపై చర్చ జరిగిందని, అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు కార్యకలాపాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. ఈ కారిడార్లు దేశంలో సరుకు రవాణాను వేగవంతం చేసి, లాజిస్టిక్స్ రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా తయారీ రంగానికి కొత్త ఊపు ఇస్తాయని వివరించారు.సెమీకండక్టర్ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "భారత చిప్ పరిశ్రమ వేగంగా పుంజుకుంటోంది. త్వరలోనే 'భారత్ చిప్స్ ప్రపంచానికి వెళ్తాయి' అన్నది వాస్తవరూపం దాల్చనుంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే ఒక ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు సావరిన్ రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

భారత్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం కూడా అంతర్జాతీయంగా మన దేశానికి ఉన్న ఆమోదాన్ని స్పష్టం చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. 'సెమీకాన్ 2.0' కార్యక్రమం ద్వారా దేశంలో సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఆరు కీలక స్తంభాలపై నిర్మిస్తున్నామని తెలిపారు. చిప్ డిజైన్, యంత్రాలు-ముడి పదార్థాలు, ఫ్యాబ్‌లు, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి ఇందులో భాగమని వివరించారు.సెమీకండక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలి దశలో 105కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయని, వాటిలో 20 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ ద్వారా రూ.800 కోట్ల నిధులను సమీకరించాయని మంత్రి వెల్లడించారు. సెమీకాన్ 2.0 కింద కనీసం 200 చిప్-డిజైన్ స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పదేళ్లలో 85,000 మంది డిజైన్ ఇంజనీర్లను తయారు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం నాలుగేళ్లలోనే 70,000 మందికి శిక్షణ పూర్తి చేశామని ఆయన సగర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 400కు పైగా యూనివర్సిటీలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) టూల్స్ అందుబాటులో ఉన్నాయని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

## మావోయిస్టులకు భారీ దెబ్బ.. రూ.2.20 కోట్ల రివార్డు ఉన్న అగ్రనేత లొంగుబాటు

మావోయిస్టు పార్టీకి పెను దెబ్బ తగిలింది. సీపీఐ (మావోయిస్ట్) కేంద్ర కమిటీ సభ్యుడైన అసిమ్ మండల్ అలియాస్ ఆకాశ్ పశ్చిమ బెంగాల్‌లో లొంగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇతనిపై జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలు భారీ మొత్తంలో రివార్డులు ప్రకటించాయి. జార్ఖండ్ ప్రభుత్వం ఇతని తలపై రూ.1 కోటి రివార్డు ప్రకటించగా, ఒడిశా ప్రభుత్వం రూ.1.20 కోట్లు రివార్డు ప్రకటించింది. మొత్తం మీద ఇతనిపై రూ.2.20 కోట్ల రివార్డు ఉంది.పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మేదినీపూర్ జిల్లా, చంద్రకోన పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉత్తర ఫుల్‌చుక్ గ్రామ నివాసి అయిన అసిమ్ మండల్.. మావోయిస్టు పార్టీలో ఆకాశ్, తిమిర్, మనోజ్, దీపక్, రాకేశ్ వంటి పలు పేర్లతో కార్యకలాపాలు సాగించాడు. ముఖ్యంగా జార్ఖండ్‌లోని కోల్హాన్, సారండా ప్రాంతాల్లో అనేక సంవత్సరాలుగా మావోయిస్టు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాడు. ఇతని లొంగుబాటును జార్ఖండ్ పోలీసులు కూడా ధ్రువీకరించారు.
జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఇతనిపై సుమారు 55 తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటిలో చాలా వరకు భద్రతా బలగాలపై దాడులు, ఎన్‌కౌంటర్లకు సంబంధించినవే. 2026 మార్చి 1న చైబాసాలోని మరంగ్‌పొంగ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కోబ్రా 209వ బెటాలియన్‌కు చెందిన అసిస్టెంట్ కమాండెంట్‌తో సహా ఇద్దరు భద్రతా సిబ్బంది గాయపడటంలో ఇతని పాత్ర ఉంది. అలాగే, 2025 ఏప్రిల్ 12న రాధాపోర వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక జార్ఖండ్ జాగ్వార్ జవాన్ మరణించాడు.
ఇవేకాక, 2023 జనవరి 11న టోంటో పోలీస్ స్టేషన్ పరిధిలోని తుంబహాక అటవీ ప్రాంతంలో జరిగిన ఐఈడీ పేలుడులో 9 మంది కోబ్రా బెటాలియన్ సిబ్బంది గాయపడ్డారు. 2020 మే 31న జోన్వాలో, 2018 జులై 11న ఝూటీ పహారీలో జరిగిన దాడుల్లో చెరొక భద్రతా సిబ్బంది మరణించారు. ఈ ఘటనలన్నింటిలోనూ అసిమ్ మండల్ కీలక సూత్రధారిగా ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి.
ప్రస్తుతం అసిమ్ మండల్‌ను అదుపులోకి తీసుకున్న భద్రతా ఏజెన్సీలు.. మావోయిస్టుల నెట్‌వర్క్, ఆయుధ నిల్వలు, రహస్య స్థావరాలపై కీలక సమాచారం రాబట్టేందుకు విచారిస్తున్నాయి. ముఖ్యంగా సారండా అడవుల్లో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాల గురించి ఇతని ద్వారా కీలక సమాచారం లభించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది

## పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారు: జగన్ పై అనిత ఫైర్

ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎస్సీ ప్రక్రియ పూర్తయి ఏడాది గడిచిన తర్వాత, కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వైసీపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని అనిత మండిపడ్డారు. వైసీపీ అధినేత జగన్ పదే పదే ప్రెస్‌మీట్లు పెట్టి నిరాధారమైన వ్యాఖ్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, అసలు వాస్తవాలు ఏమిటో ప్రజలకు స్పష్టంగా తెలుసని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే వీరికి తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.మరోవైపు, ఏపీపీఎస్సీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే వైసీపీ ఈ రాద్ధాంతం చేస్తోందని అప్పసాని రాజేశ్ ఆరోపించారు. డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వేసిన 320 కేసులను న్యాయస్థానం కొట్టివేసిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల పాలనలో 'జాబ్‌లెస్ క్యాలెండర్'తో యువతను మోసం చేసిన జగన్, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

## నిజామాబాద్‌లో యూట్యూబర్ వైష్ణవి భర్త హత్య

- మొదటి పేజి తరువాయి

బొండాలు నరికే కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణాలు తీశాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ దాడిలో ముగ్గురు నిందితులు పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. మిగతా వారు కారులో ఉండగా, ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి (19)కి, కోరుట్ల పట్టణంలోని ఏసుకోనిగుట్ట ప్రాంతానికి చెందిన హరిబాబుతో వివాహం జరిగింది. అయితే, గతంలో యూట్యూబర్‌గా గుర్తింపు పొందిన వైష్ణవి దారుణ హత్యకు గురైంది. ఆ సమయంలో ఆమె నాలుగు నెలల గర్భిణి. భర్త హరిబాబు ఆమెను గొంతు నులిమి చంపడమే కాకుండా, చేతులు, నుదుటిపై కత్తితో పొడిచినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.వైష్ణవి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు హరిబాబును అరెస్ట్ చేసి జైలుకు పంపారు. కొంతకాలం రిమాండ్‌లో ఉన్న అతడు, ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ క్రమంలోనే పాత కక్షల నేపథ్యంలో ప్రత్యర్థులు పథకం ప్రకారం హరిబాబును హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే గనులపై మైనింగ్ శాఖ దాడి..

అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు పరిధిలో అక్రమ మైనింగ్ వ్యవహారం కలకలం రేపుతోంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి చెందిన గనుల్లో లీజు నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా తవ్వకాలు సాగిస్తున్నారన్న ఫిర్యాదులపై మైనింగ్ శాఖ అధికారులు ఈరోజు మెరుపు దాడులు నిర్వహించారు.సాంకేతిక బృందాలతో కలిసి రంగంలోకి దిగిన అధికారులు మైనింగ్ సరిహద్దులు, పరిమితికి మించిన క్వారీయింగ్ ఆరోపణలపై పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టారు. అధునాతన మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా నిబంధనలను ఉల్లంఘించి ఎంత మొత్తం ఖనిజాన్ని అక్రమంగా తరలించారో తేల్చేందుకు సర్వే నిర్వహించారు. ఈ సోదాల సందర్భంగా.. మైనింగ్ నిర్వహణకు ఉపయోగిస్తున్న హెవీ యంత్రాలు, పొక్లెయిన్లు, రవాణా వాహనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.ఈ తనిఖీలపై మైనింగ్ శాఖ అధికారులు మాట్లాడుతూ.. నేమకల్లు గనుల్లో జరిగిన నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. మైనింగ్ చట్టాల ప్రకారం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అక్రమ తవ్వకాలపై విచారణ కొనసాగుతోందని, ఉల్లంఘనలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.

## ప్రధాని మోదీ పుట్టినరోజు.. 'ఆశీర్వాద దీపం' వెలిగించిన నారా లోకేశ్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసంలో 'నమో 76' అంటూ 'ఆశీర్వాద దీపం' వెలిగించి, ప్రధాని సంపూర్ణ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి జన్మదినం సందర్భంగా, ఆయన ఆయురారోగ్యాలతో, శక్తిసామర్థ్యాలతో దేశానికి చిరకాలం సేవ చేయాలని ఆకాంక్షిస్తూ మా నివాసంలో ఆశీర్వాద దీపం వెలిగించాను" అని లోకేశ్ పేర్కొన్నారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం సరైన దిశలో పయనిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. "అభివృద్ధి, సాధికారత, 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' స్ఫూర్తితో మోదీ గారి సారథ్యంలో భారతదేశం 'వికసిత భారత్' లక్ష్యం దిశగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోంది. ఆయన మన దేశాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు నడిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని లోకేశ్ తన సందేశంలో తెలిపారు. ఈ మేరకు ఫొటోలను లోకేశ్ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట అప్రకటిత విద్యుత్ కోతలు


రాత్రి విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు


వరి పంటకు విద్యుత్ బోర్లు ఆసరా


విద్యుత్ సరఫరా నిలివితేత


చీకటిలో జగ్గంపేట రహదారులు

- వేసవిలో కంటే ఇప్పుడే విద్యుత్ వాడకం ఎక్కువ
- ఎండలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రాత్రి పూట విద్యుత్ కోతలతో ఉక్కపోత
- పరిశ్రమలకు తప్పని తిప్పలు
- విద్యుత్ కోతలు తాత్కాలికమే అంటున్న అధికారులు
- ఎల్ నినో ప్రభావం తగ్గే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబరు 17:** ఇటీవల జగ్గంపేటలో ఎమెర్జెన్సీ లోడ్ రిలీఫ్(ఈఎల్ఆర్) పేరిట అప్రకటిత విద్యుత్ కోతలు ఎక్కువవయ్యాయి. ఎల్ నినో ప్రభావం అన్ని రంగాలపై ప్రభావం చూపుతుందనడంలో ఏమాత్రం అతియోశక్తి లేదు. ఎందుకంటే ఎల్ నినో వల్ల వర్షాలు తగ్గి లోటు వర్షపాతం నమోదవుతుంది. వేసవి పోయి మరో వేసవి వచ్చినట్లు ఎండలు మండుతున్నాయి. ప్రస్తుతం ఎక్కడ చూసిన రెండో వేసవి తలపిస్తుంది. సాధారణంగా సెప్టెంబరు నెలలో వర్షాలు, వరదలతో అకాల వర్షాల వాతావరణం ఏర్పడేది. కానీ అందుకు భిన్నంగా ఎల్ నినో ప్రభావంతో భానుడి భగభగలతో మండిపోతుంది. రహదారులన్నీ వేసవికాలం మాదిరిగా నిర్మానుష్యంగా ఉంటున్నాయి. గృహ, వ్యవసాయ, వాణిజ్య వినియోగానికి విద్యుత్ ను తెగ వాడేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు వాడకం పెరిగింది. ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ఏసీల వినియోగం అమాతంగా రోజురోజుకు పెరుగుతుంది. మరో పక్క వరి పంట ఎక్కువగా వేయడంతో వర్షాలు లేక కాలువల నుంచి నీరు రాకపోవడంతో మెట్ట ప్రాంతమైన జగ్గంపేటలో అధిక శాతం రైతులు విద్యుత్ బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్నారు. సోలార్ పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడం వల్ల సోలార్ విద్యుత్పత్తి అంతంత మాత్రంగానే ఉంది. దీంతో వేసవి కంటే ఇప్పుడే విద్యుత్ వినియోగం ఎక్కువ నమోదవుతుందని విద్యుత్ శాఖాధికారులు చెపుతున్నారు. విద్యుత్ డిమాండ్ ఎక్కువ కావడం వేసవి కంటే ఎక్కువ విద్యుత్ వాడుతుండడంతో ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ పేరిట విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారు. అయితే రాత్రి సమయంలో మాత్రమే విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు ఉక్కపోతకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఎంత విద్యుత్ వాడుతున్నారో రాత్రి కూడా అంతే విద్యుత్ వాడడంతో గ్రిడ్ ప్రీక్వెన్సీ నిర్వాహణకు ఇబ్బందిగా మారుతుందని అధికారులు తెలుపుతున్నారు. దీనిపై జగ్గంపేట విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావును వివరణ కోరగా సాధారణంగా గ్రిడ్ ప్రీక్వెన్సీ 50 హెడ్జ్ స్టాండింగ్ మెయింటెన్ చేయాలని అంతకంటే తక్కువ దిగితే గ్రిడ్ ప్రీక్వెన్సీ దెబ్బతిని మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయే ప్రమాదముందంటున్నారు. గ్రిడ్ ప్రీక్వెన్సీ దెబ్బతినకుండా ఈఎల్ఆర్ ఇస్తున్నామన్నారు. పగలు సమయంలో సోలార్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేసి నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామని రాత్రి సమయంలో నాన్ సోలార్ అవర్స్ వల్ల విద్యుత్ సరఫరా అవ్వదని దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే రాత్రుళ్లు విద్యుత్తు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ ఎల్ ఆర్ విద్యుత్ కోతలు అనేది తాత్కాలికం మాత్రమేనని విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

# పెన్ పవర్

కాకినాడ

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## ఘనంగా కాజులూరు పాలక మండలి వీడ్కోలు సభ





### ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు ఘన సన్మానం

**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** కాజులూరు మండల పరిషత్ పాలక మండలికి గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. పాలక మండలి ఈ నెల 23న పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మండల పరిషత్ కార్యాలయంలో తుది సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన, ఎంపీడీవో జె. రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండలంలోని అభివృద్ధి పనులు, వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించారు.వ్యవసాయ శాఖ అధికారి వి.అశోక్ మాట్లాడుతూ రైతులకు ఎరువుల సరఫరా సక్రమంగా జరుగుతోందని తెలిపారు. హౌసింగ్ ఇన్‌చార్జి, చేదువాడ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రసన్న మాట్లాడుతూ కొత్త గృహ నిర్మాణ పథకానికి సంబంధించి 96 మంది అర్హులుగా గుర్తించగా, 21 మందిని అనర్హుల జాబితాలో చేర్చినట్లు వివరించారు.ఎంఈవో జాన్ మాట్లాడుతూ మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులకు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయని తెలిపారు. పంచాయతీరాజ్ జేఈ భవానీశంకర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పలు ప్రధాన పనులను పూర్తిచేశామని, మిగిలిన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రూప మాట్లాడుతూ మరో పది రోజుల్లో గొల్లపాలెం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించే అవకాశం ఉందని, దీంతో మండలంలో తాగునీటి సమస్యకు కొంతమేర పరిష్కారం లభిస్తుందని తెలిపారు.వెలుగు ఏపీఎం టి. మురళీకృష్ణ మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు ఇప్పటివరకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.28 కోట్లు, స్త్రీనిధి ద్వారా రూ.8 కోట్లు, ఉన్నతి పథకం కింద రూ.34 లక్షల రుణాలు అందించినట్లు వివరించారు.దుగ్గుదూరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వాతి మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించడం, వాటికి సహకరించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. టీనేజీ బాలికలకు సంబంధించి ఏడు గర్భధారణ కేసులు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొంటూ, గ్రామాల్లో బాల్య వివాహాలకు ప్రజలు సహకరించవద్దని సూచించారు. ఈ అంశంపై పల్లిపాలెం ఎంపీటీసీ మాట్లాడుతూ బాల్య వివాహాలపై సమాచారం అందించినప్పుడు గ్రామాల్లో తమపై గొడవలకు దిగుతున్న పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఐసీడీఎస్ సీడీపీవో, సూపర్‌వైజర్ కె.రమణకుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహిస్తున్నామని, కొన్ని నూతన భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. జగన్నాధగిరిలో అంగన్వాడీ భవనం నిర్మించినప్పటికీ తలుపులు ఏర్పాటు చేయలేదని ఎంపీటీసీ లక్ష్మి కొప్పన ప్రశ్నించారు. నిధుల కొరత కారణంగా పనులు పూర్తికాలేదని ఎంపీడీవో జె. రాంబాబు, సూపర్‌వైజర్ వివరించడంతో సమస్య సద్దుమణిగింది.ఈ సందర్భంగా ఎంపీపీ మాత భారతి మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలంలో గ్రామాల అభివృద్ధికి సహకరించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు పాలక మండలి తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, వైస్ ఎంపీపీలు పెద్దిరెడ్డి వెంకటరమణ, రేఖాడి విజయ, ఎంపీటీసీలు గండి మణికంట, కృష్ణమూర్తి, ఆనాల సీత, గొల్లపల్లి సింహాద్రి తదితరులు పాత పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కొన్ని పనులు నిలిచిపోయాయని, వాటికి బిల్లులు చెల్లించి పనులు పూర్తిచేయాలని ఎంపీడీవోను కోరారు. బడ్జెట్ విడుదలైన వెంటనే పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.అనంతరం పాలక మండలి సభ్యులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంపీపీ మాత భారతి దంపతులు, జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులను మండల పరిషత్ సభ్యులు, రాజకీయ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఐదేళ్ల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా పరస్పరం అభినందనలు,శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.


## కాజులూరులో సేవా సంకల్ప మహోత్సవం ప్రారంభం

### ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు




**కాజులూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప మహోత్సవ కార్యక్రమాలు కాజులూరు మండలంలో గురువారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు ఆడబాల సత్యనారాయణ పిలుపు మేరకు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.కాజులూరు మండల బీజేపీ అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ అధ్యక్షతన కాజులూరు శ్రీ కోదండరామ ఆలయంలో నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో, సంపూర్ణ ఆయుష్షుతో ఉండాలని ఆకాంక్షిస్తూ అష్టోత్తర శతనామావళి కైంకర్య పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. సాయంత్రం ప్రజలంతా దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని సేవా సంకల్ప మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎల్ఏ కో-కన్వీనర్ దేవు పట్టాభి, ఉపాధ్యక్షుడు పోలిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు నిమ్మన రాజేష్, వాసంశెట్టి రామకృష్ణతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు యువత పెద్ద సంఖ్యలో సిద్ధమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# డేంజర్ జోన్‌గా మల్లేపల్లి సచివాలయం!





### రక్షణ లేకుండా వేలాడుతున్న విద్యుత్ వైర్లు

### ప్రాణభయంతో సచివాలయానికి వస్తున్న లబ్ధిదారులు

### అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న ప్రజలు

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** మల్లేపల్లి సచివాలయం వద్ద విద్యుత్ వైర్ల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. మీటర్‌కు వెళ్లే విద్యుత్ వైరు కింద భాగంలో ఎలాంటి రక్షణ లేకుండా వేలాడుతూ ఉండటంతో సచివాలయానికి వచ్చే లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గండేపల్లి మండలం మల్లేపల్లి సచివాలయానికి మల్లేపల్లితో పాటు కే.గోపాలపురం గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ ప్రభుత్వ సేవల కోసం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే సచివాలయ ప్రాంగణంలో విద్యుత్ వైర్లు రక్షణ లేకుండా ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు చెబుతున్నారు.


సర్వీస్ వైర్ నుంచి వేరుగా తీసిన మరో వైరు కిటికీ సమీపంలో రక్షణ లేకుండా మీటర్‌కు అనుసంధానించి ఉన్నట్లు కనిపిస్తోంది. అంతేకాకుండా వైర్లు కిందికి వేలాడుతున్న పరిస్థితి ఉండటంతో విద్యుత్ లీకేజీ లేదా ఇతర కారణాలతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన సమయంలో ఇటువంటి విద్యుత్ వైరింగ్ ఎలా కొనసాగుతోందనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయంలో అనేక నిబంధనలు పాటించాలని సూచించే విద్యుత్ శాఖ అధికారులు.. ప్రభుత్వ కార్యాలయం వద్ద భద్రతా ప్రమాణాల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.సచివాలయ సిబ్బంది కూడా ఈ పరిస్థితిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించే వరకు వేచి చూడకుండా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే పరిశీలించి, ప్రమాదకర వైరింగ్‌ను సరిచేయాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# కల్తీ ఆహారంపై ఉక్కుపాదం.. ...


గోదావరి రుచులు షాపులో శాంపిల్స్ సేకరణ



**ఆత్రేయపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 17** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఆహార కల్తీకి అడ్డుకట్ట వేసేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలను ముమ్మరం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆత్రేయపురం మండల కేంద్రంలోని పలు ఆహార విక్రయ కేంద్రాల్లో గురువారం తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్. రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆహార తనిఖీ అధికారి రామయ్య తనిఖీలను చేపట్టారు.మండల కేంద్రంలోని లొల్ల లాకుల సమీపంలో ఉన్న గోదావరి రుచులు షాపులో అధికారులు ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, కల్తీకి సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు శాంపిల్స్ తీసుకున్నట్లు సమాచారం. సేకరించిన నమూనాలను పరీక్షలకు పంపించి, నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

**గతంలో 21 శాంపిల్స్ సేకరణ**

ఆహార కల్తీపై అధికారులు గతంలోనూ తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు 21 శాంపిల్స్ సేకరించగా, వాటిలో దాదాపు అన్నీ కల్తీగా తేలినట్లు అధికారులు తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాలపై మరింత నిఘా అవసరమని స్థానికంగా చర్చ జరుగుతోంది.ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, కల్తీ పదార్థాల వినియోగం వంటి అంశాలు ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రజలు నిత్యం వినియోగించే ఆహార పదార్థాల విషయంలో వ్యాపారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అధికారుల తనిఖీలు నాణ్యతా ప్రమాణాల అమలును పరిశీలించడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలకు దోహదపడనున్నాయి.

**నిరంతర తనిఖీలకు అధికారుల హామీ**

ఇకపై ఆత్రేయపురం పరిధిలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్. రమేష్ బాబు తెలిపారు. ఆహార కల్తీకి పాల్పడే వ్యాపారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఆహార భద్రతా నిబంధనలను ప్రతి వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. కల్తీకి పాల్పడే వారిపై చట్టపరమైన నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే దిశగా తనిఖీలను కొనసాగించనున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు చేపడుతున్న తనిఖీలు మరింత విస్తృతం కానున్న నేపథ్యంలో, ఆహార వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులు హెచ్చరించారు.



## మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి: ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 15,**భారతదేశాన్ని ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దడంలో ప్రధాని నరేంద్ర మోదీ పాత్ర విశేషమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా గురువారం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, భాజపా సీనియర్ నాయకుడు పాలూరి సత్యానందం తదితరులతో కలిసి ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛభారత్, జనధన్, ఆయుష్మాన్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో దేశ పురోగతికి మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. దేశ రక్షణ, రైతుల సంక్షేమం, పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర, దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## వాడపల్లి వెంకన్న సన్నిధికి పోటెత్తిన భక్తజనం..

స్వామివారికి నిత్యా అన్నదానానికి రూ.50,116 విరాళం





**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 17:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి గురువారం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారింది. ఏడు వారాల నోము అనంతరం ఆలయంలో నిర్వహించిన అష్టోత్తర పూజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ సన్నిధిలో నిర్వహించిన నిత్యాన్నదాన ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని ఆలయానికి విరాళాలు సమర్పించారు. కృష్ణా జిల్లా కానూరు గ్రామానికి చెందిన వెలివెల విజయ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళంగా అందజేశారు.విరాళాలు సమర్పించిన కుటుంబ సభ్యులను ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ అధికారి వై. శ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన ఆలయంలో పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.

## రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతకు, డాక్టరేట్ సాధించిన లెక్చరర్‌కు ఘన సన్మానం



**రావులపాలెం, పెన్ పవర్ సెప్టెంబర్ 17:**రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత డాక్టర్ యనుముల విశ్వకనకం, ఇటీవల డాక్టరేట్ పొందిన డాక్టర్ అంబటి రామారావులను కళాశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న బోటనీ జూనియర్ లెక్చరర్ డాక్టర్ యనుముల విశ్వకనకం, ఎకనామిక్స్ లెక్చరర్ డాక్టర్ అంబటి రామారావులను కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనకిరెడ్డి, సెక్రటరీ కొవ్వూరు నరేష్ కుమార్ రెడ్డి, సభ్యులు అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ కనకిరెడ్డి మాట్లాడుతూ అధ్యాపకుల విశిష్ట గుర్తింపు కళాశాల ఖ్యాతిని రాష్ట్రస్థాయిలోప్రతిబింబిస్తోందన్నారు. సెక్రటరీ నరేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ప్రతిభావంతులైన అధ్యాపకులు పనిచేయడం రావులపాలెం కళాశాలతో పాటు అంబేద్కర్ కోనసీమ జిల్లాకు గర్వకారణమన్నారు. ప్రిన్సిపల్ ఎస్.వి. సూర్యనారాయణ రెడ్డి డాక్టర్ విశ్వకనకం సాధించిన పలు అవార్డులను ప్రస్తావిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు, పీటీఏ సభ్యులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# శంఖవరం రౌతులపూడి ప్రాంతాల్లో భారీ లారీల రవాణాపై ఆందోళన...

- ఈ నెల 25 నుంచి 29 వరకు రిలే నిరాహార దీక్షలకు అనుమతి కోరుతూ అధికారులకు వినతిపత్రం...




**శంఖవరం పెన్ పవర్ సెప్టెంబర్ 17:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం, రౌతులపూడి మండలాల పరిధిలో అధిక బరువుతో కూడిన లారీల ద్వారా ప్రాసెస్ చేసిన ఎర్రమట్టి, నల్లరాయి రవాణా జరుగు తుండటంతో సుమారు 14 గ్రామాల ప్రజలు ప్రత్యక్షంగా, మరో 50 గ్రామాల ప్రజలు పరోక్షంగా గత 15 సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం సభ్యులు తెలిపారు. అధిక బరువుతో లారీల రాకపోకల కారణంగా రహదారులు దెబ్బతినడంతో పాటు, దుమ్ము, శబ్ద కాలుష్యం, ప్రమాదాల భయం వంటి సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలను గ్రామస్థాయిలోని వివిధ శాఖల అధికారులు గమనిస్తున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు.

ఈ నేపథ్యంలో 2026 జూన్ 19న నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి సేవా సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు పేర్కొన్నారు. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 25 నుంచి 29వ తేదీ వరకు శంఖవరం గ్రామంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రిలే నిరాహార దీక్షలకు అనుమతి మంజూరు చేయడంతో పాటు, అధిక బరువుతో లారీల రవాణాను నియంత్రించి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ సంబంధిత అధికారులకు సంఘ సభ్యులు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు గునపర్తి అపురూప్, కార్యదర్శి పర్వత రామకృష్ణ, సహాయ కార్యదర్శి పగడాల మోహన్ సన్యాసరావు, కోశాధికారి గుద్దాటి నాగేశ్వరరావు బుర్ర సత్తిబాబు, రేలంగి వెంకట సత్యనారాయణ, రేలంగి వెంకన్న, బొమ్మిడి సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం కొత్త సిఐ గా బాధ్యతలు చేపట్టిన జి వి వి సత్యనారాయణ.



**పిఠాపురం పెన్ పవర్ సెప్టెంబర్ 17:**పిఠాపురం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా విధులు నిర్వహించిన జి.శ్రీనివాస్ బదిలీ..విజయవాడలో ఏసీబీలో విధులు నిర్వహించి బదిలీపై పిఠాపురం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా బాధ్యతలు చేపడుతున్న జీవివి సత్యనారాయణ..



**ఆత్రేయపురం, పెన్ పవర్ సెప్టెంబర్ 17:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ఆత్రేయపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులకు వెళ్లిన ఓ వేతన శ్రామికుడు తేనెటీగల దాడికి గురై మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. సెప్టెంబర్ 16న లొల్ల లాకుల నుంచి ఆత్రేయపురం సరిహద్దు వరకు జరుగుతున్న పనుల్లో పాల్గొన్న యార్లగడ్డ సత్యానందం అనే ఉపాధిహామీ వేతన శ్రామికుడిని తేనెటీగలు కుట్టాయి.

పని ప్రదేశంలో తేనెటీగలు కుట్టడంతో సత్యానందాన్ని విశ్రాంతి నిమిత్తం ఇంటికి పంపించినట్లు అధికారులు తెలిపారు. అయితే అదే రోజు రాత్రి 6.45 గంటలకు ఆయన మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై సంబంధిత అధికారులకు సమాచారం అందించగా, వారి ఆదేశాల తో ఆత్రేయపురం ఫీల్డ్ అసిస్టెంట్ బాధిత కుటుంబాన్ని పరామర్శించినట్లు ఎంపీడీవో, అదనపు ప్రోగ్రాం అధికారి పి.వి.ఆర్.కె. రాజు వెల్లడించారు.అధికారుల పరామర్శ ఉపాధిహామీ పనుల్లో చోటుచేసుకున్న ఈ ఘటనపై అధికారులు స్పందించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.


## రైతులు నీటిని సమర్థవంతంగా వాడుకోవాలి



జగ్గంపేట ఏవో నరసింహం

**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** రైతులు ఉన్న నీటిని సమర్థవంతంగా వాడుకోవాలని జగ్గంపేట వ్యవసాయాధికారి ఎస్. నరసింహం అన్నారు. గురువారం జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహం మాట్లాడుతూ సూపర్ ఎల్ నినో వల్ల రాబోవు రోజుల్లో అక్టోబర్, నవంబర్ నెలల్లో కూడా ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ ఇచ్చిన సూచన మేరకు రైతు సోదరులు ఉన్న నీటిని సమర్థవంతంగా వాడుకోవాలన్నారు. అదేవిధంగా ఖాళీగా ఉన్న భూములు వృధాగా ఉంచకుండా ఏదైనా పంటలతో కప్పి ఉంచినట్లయితే భూమిలో ఉన్న సూక్ష్మ జీవులు నష్టపోకుండా సేంద్రియ కర్బనము నష్టపోకుండా ఉంటుందన్నారు. కావున ప్రతి రైతు సోదరులకు పి.ఎం.డి.ఎస్, అపరాలు లేదా సెనగలు వంటి విత్తనాల సాగు చేసుకోవడం ద్వారా తక్కువ వర్షపాతంతో పంట సాగు చేయగలమని సూచించారు .అంతేకాక 80 శాతం రాయితీపై అపరాలను అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఉంచడం జరుగుతుంది. కావున రైతు ప్రతి ఒక్క రైతు తన యొక్క భూమిని ఏదో ఒక పంటతో సాగు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఎస్ నరసింహ తెలిపారు.

## మురారి గ్రామంలో ఘనంగా విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలు



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 17:**గండేపల్లి మండలం మురారి గ్రామంలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠ ప్రాంగణంలో విశ్వకర్మ భగవానునికి ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ధ్వజారోహణ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుని చరిత్ర, విశిష్టత, విశ్వకర్మ సమాజానికి ఆయన అందించిన స్ఫూర్తి గురించి కార్యక్రమంలో వివరించారు. విశ్వకర్మ భగవానుడు కేవలం విశ్వకర్మలకే పరిమితమైన దైవం కాదని, సృష్టి, నిర్మాణం, కళలు, వృత్తులకు ఆదర్శప్రాయమైన దైవంగా ప్రతి ఒక్కరూ ఆయనను ఆరాధించాలని తెలిపారు.

ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ భగవానుని పూజించడంతో పాటు తమ తమ పనిముట్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు బ్రహ్మశ్రీ పట్నాల దుర్గారావు గారు, సెక్రటరీ బ్రహ్మశ్రీ ఉప్పనపిల్లి ధర్మరాజు గారు పురోహితులు బ్రహ్మశ్రీ పట్నాల అన్నవరం గారు సంఘ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సోదరులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త శ్రీ కందుల కొండయ్య దొరగారు విశ్వబ్రాహ్మణ సంఘం మురారి

## ఏలేశ్వరంలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి.






**ఏలేశ్వరం, పెన్ పవర్,సెప్టెంబర్ 17:** స్థానిక శ్రీ కామాక్షి కార్పెంటర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కామాక్షి కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండూరి నరసింహమూర్తి సాంప్రదాయ బద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కూటమి సీనియర్ నాయకుడు అలమండ చలమయ్య విశ్వకర్మ భగవాన్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ శ్రీ కామాక్షి కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులు ప్రతి ఏడాది విశ్వకర్మ జయంతి వేడుకలను సన్ సత్ సంప్రదాయబద్ధంగా నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం విశ్వకర్మ జెండా ఆవిష్కరించారు. బాలాజీ చౌక్ సెంటర్ వరకు రథయాత్ర నిర్వహించి విశ్వకర్మ భగవాన్ గొప్పతనాన్ని చాటి చెప్పారు. ఆదర్శప్రాయుడు విశ్వకర్మ భగవాన్ ఉపన్యాసాల్లో వివరించినట్లు తూచా తప్పకుండా పాటించి సమిష్టిగా కృషిచేసి ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



**సామర్లకోట.. పెన్ పవర్... సెప్టెంబర్..17..**పెద్దాపురం నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప సేవల పట్ల తాను ఆకర్షితుడినై త్వరలో తెలుగుదేశం పార్టీలో జాయిన్ అవ్వడం జరుగుతుందని పట్టణ పరిధి 2 వార్డుకు చెందిన పట్టా వీరబాబు పేర్కొన్నారు. గురువారం సామర్లకోట మండలం అచ్చంపేట లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వీరబాబు తదితరులు ఎమ్మెల్యే చినరాజప్ప,టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మకాయల రంగనాగ్ లను మర్యాద పూర్వకంగా కలిశారు.అనంతరం పట్టణ పరిధిలోని టిడిపి నాయకులు బదుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీష్ మోహన్ మర్యాద పూర్వకంగా కలిసినట్లు వీరబాబు పేర్కొన్నారు.

# అయినవిల్లి విఘ్నేశ్వరుడి సన్నిధిలో వైభవంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు




### భక్తులను ఆకట్టుకున్న చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

**అయినవిల్లి, పెన్ పవర్ సెప్టెంబర్ 17 :** కోనసీమ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం భాద్రపద మాసం శుద్ధ షష్టి సందర్భంగా ఆలయ సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి మేలుకొలుపు సేవను భక్తిపూర్వకంగా నిర్వహించి, అనంతరం లఘున్యాస అభిషేక కార్యక్రమాన్ని చేపట్టారు.
భక్తిశ్రద్ధలతో లఘున్యాస అభిషేకం శ్రీ విఘ్నేశ్వర స్వామివారి లఘున్యాస అభిషేకంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులతో సన్నిధి సందడిగా మారింది. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు స్వామివారి ఆశీస్సులు పొందారు.
చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనఆలయ సన్నిధిలో నిర్వహించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సంప్రదాయ నృత్యరీతిలో చిన్నారులు ప్రదర్శించిన కళారూపాలు ప్రేక్షకులను అలరించాయి. ఆలయ ఆధ్యాత్మిక వాతావరణంలో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించడం విశేషంగా నిలిచింది. చిన్నారుల ప్రతిభను గుర్తించిన ఆలయ ధర్మకర్తల మండలి వారిని అభినందించింది.
కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీ విళ్ళ సూర్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రశంసాపత్రాలు అందజేశారు. చిన్నారులను ప్రోత్సహిస్తూ వారి కళా ప్రతిభను అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా భక్తుల్లో ఆధ్యాత్మికతతో పాటు కళల పట్ల ఆసక్తి పెంపొందుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.
భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లుగణపతి నవరాత్రి మహోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ముదునూరు సత్యనారాయణ రాజు తెలిపారు. భక్తుల రాకపోకలు, దర్శనం, పూజా కార్యక్రమాల సమయంలో అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు



తీసుకున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. స్వామివారి ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనతో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయ సన్నిధి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు భక్తిభావంతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# కిర్లంపూడిలో అంగరంగ వైభవంగా శ్రీ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ వేడుకలు.






**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 17:** శిల్పకళకు, సృజనాత్మకతకు, శ్రమకు ప్రతిరూపమైన దేవశిల్పి శ్రీ విశ్వకర్మ భగవానుని యజ్ఞ మహోత్సవ వేడుకలను కిర్లంపూడి మండలం విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేంచేసియున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద జరిగిన ఈ వేడుకల్లో ఉదయం నుండి స్వామి వారికి పంచామృత అభిషేకాలు,ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా
విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ విశ్వకర్మ సమస్త విజ్ఞానానికి సృష్టికర్తయని
విశ్వకర్మ జయంతి అనేది మనందరికీ ఒక పండుగ మాత్రమే కాదని,మన ఉనికికి, మన వృత్తి గొప్పతనానికి నిదర్శనమన్నారు. మన పెద్దలు తమ చేతి నైపుణ్యంతో సమాజానికి ఎంతో సేవ చేశారన్నారు. నేటి ఆధునిక కాలంలో కూడా మన జాతి పిల్లలు ఆ నైపుణ్యాన్ని కాపాడుకుంటూ, చదువుతో పాటు నూతన టెక్నాలజీని నేర్చుకుని ముందుకు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. మండల విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు గానుగుల శ్రీనివాసరావు లక్ష్మీ,కొత్తల శ్రీను సునీతా,వానపల్లి గంగరాజు నూకామణి,బసవేశ్వరపు అచ్చిరాజు కామాక్షి,పట్నాల త్రిమూర్తులు విజయదుర్గ దంపతులు పంచ బ్రహ్మలుగా పీటలపై కూర్చుని అంగరంగ వైభవంగా విశ్వకర్మ యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రదాన కార్యదర్శి కొత్తల వీరప్రసాద్, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు అత్తిలి వీరబ్రహ్మం, లక్కోజు శివరామకృష్ణ,దివిలి అచ్చారావు, దివిలి సుబ్రహ్మణ్యం, పట్నాల గంగరాజు, ఆరట్లకట్ల శ్రీను, జొన్నకోటి లోవ, కిల్లంపల్లి అప్పలాచార్యులు, లక్కోజు పెదలోవ,శలపాక శివప్రసాద్, నాగోజు శివ, తోపాటు మండలం నలుమూలల నుండి , విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు, మహిళలు,యువత అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదములు స్వీకరించారు.




# ఆదిత్య యూనివర్సిటీ లో ఐ.ఓ.టి మరియు ఎంబెడెడ్ టెక్నాలజీస్"పై వర్క్‌షాప్

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 17:** గండేపల్లి మండలం సూరంపాలెం, ఆదిత్య యూనివర్సిటీ లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో "కనెక్టెడ్ కమ్యూనిటీస్: ఐ.ఓ.టి మరియు ఎంబెడెడ్ టెక్నాలజీస్" అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఓ.టి ), ఎంబెడెడ్ సిస్టమ్స్, స్మార్ట్ డివైసెస్ మరియు కనెక్టెడ్ అప్లికేషన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని అందించడం ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వహించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించడం,ఐ.ఓ.టి మరియు ఎంబెడెడ్ టెక్నాలజీల వాస్తవ ప్రపంచ అనువర్తనాల పై అవగాహన కల్పించడం కార్యక్రమం ముఖ్య లక్ష్యం . ఈ వర్క్‌షాప్‌కు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్ మెరిటైం అండ్ షిప్ బిల్డింగ్ విశాఖపట్నం కు చెందిన టెక్నికల్ ఇంజినీర్లు శివ ప్రభు సెరుమహందాపురపు మరియు భవాని ఇడదాసు రిసోర్స్ పర్సన్స్‌గా పాల్గొన్నారు. వారు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరిశ్రమ అనుభవాలు విద్యార్థులతో పంచుకున్నారు. ఇంటరాక్టివ్ సెషన్స్, సాంకేతిక చర్చలు మరియు ప్రాక్టికల్ డెమాన్‌స్ట్రేషన్ల ద్వారా విద్యార్థులకు ఐ.ఓ.టి మరియు ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై విలువైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డా. జి. శ్రీదేవి, విభాగాధిపతి డా.సి.హెచ్ . జానకి దేవి, డిప్యూటీ హెచ్‌ఓడీలు డా. సి.హెచ్. రవిశంకర్, డా. కె.హెచ్.కె. ప్రసాద్ మరియు వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డా. మహేష్ కుమార్ సింగ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.




**పెద్దాపురం.. పెన్ పవర్.. సెప్టెంబర్.. 17..** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకుని పెద్దాపురం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిభిరాన్ని నిర్వహించారు. బ్యాంక్ కాలనీలో రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆవరణలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని బిజెపి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బిజెపి నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ చెరుకూరి రవికృష్ణ, పట్టణ బిజెపి అధ్యక్షులు రావులపర్తి విజయ ప్రకాష్, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుర్గ మోహన్ రావు లు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశానికి చేసిన సేవలు స్థిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతావని అన్నింటా ముందుకు దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో చీకట్ల నాగేశ్వరరావు, దేవాడ శ్రీనివాసరావు,నలపాటి సురేష్, దేవతా రాజేష్, ఎం. వీరబాబు, ప్రభాకర్, కొత్త వీరభద్రరావు,తిరుమల రావు, బ్లడ్ బ్యాంకు సభ్యులు కె.ఎస్ బి చౌదరి, టి. సత్యనారాయణ, గంగాదరుడు, నాగరాజు, లక్ష్మి పాల్గొన్నారు. మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి ద్వారా రక్తదాతలకు పౌష్టికహారం అందజేశారు.

# విద్యతోనే అభివృద్ధి సాధ్యం : పీసీసీ బహుమతి ప్రధానోత్సవ సభలో వక్తలు




**పెద్దాపురం.. పెన్ పవర్.. సెప్టెంబర్.. 17..** విద్య ద్వారానే సమాజ అభివృద్ధి, మానవుల అభివృద్ధి జరుగుతుందని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జ్యోసుల కృష్ణబాబు అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్య ఆవశ్యకత అనే అంశం పై పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల బహుమతి ప్రధానోత్సవ సభ పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనం లో పీసీసీ అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధులుగా చేనేత సొసైటీ అధ్యక్షులు ముప్పన వీర్రాజు, పెద్దాపురం – సామర్లకోట రోటరీ కార్యదర్శి బి ఆంజనేయులు, గంగాధరుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామజిక అవగాహనా, విద్యపట్ల బాధ్యత పెంచడానికి పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ కృషి చేస్తుందని అన్నారు. సమాజం లో విద్యకు చాలా ప్రాధాన్యత ఉందని తెలిపారు. సమాజం లో జరిగే ప్రతీ మార్పు విద్యతోనే అని మనము గుర్తించాలని తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ పెద్దాపురం – సామర్లకోట వారి సహకారం తో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ సభ్యులు మంజుల స్వాగతం పలుకగా, నెక్కల అనూష వందన సమర్పణ చేసారు. ఈ కార్యక్రమం లో పీసీసీ సభ్యులు వానపల్లి సాయి, తేజా, ఎన్. జిస్విత, కె పవన్ కుమార్, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకులంలో... స్వచ్ఛత హీ సేవా పై అవగాహన కార్యక్రమం.






**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం పై విద్యార్థులకు అవగాహన గురువారం కల్పించారు. ఏలేశ్వరం మున్సిపాలిటీ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర శారద పర్యవేక్షణలో నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేసి , పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు తడి చెత్త – పొడి చెత్త వేరు చేయుట, అంటువ్యాధుల నివారణ , ఇతర స్వచ్ఛత అంశములపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ శానిటరీ ఇన్స్పెక్టర్ జి వి ఆర్ శేఖర్, శానిటరీ సెక్రటరీలు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శారద , ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పరిసరాలను పరిశుభ్రంగా, ఉంచాలని సూచించారు. వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్త, ఎలక్ట్రానిక్ వ్యర్థాలుగా విభజించి, నిర్దేశించిన రంగుల బిన్లలో వేయాలని అవగాహన కల్పించారు,పసుపు రంగు బిన్లలో తడి చెత్త, నీలం రంగు బిన్లలో పొడి చెత్త, ఆకుపచ్చ రంగు బిన్లలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈ–వేస్ట్)కు ఉపయోగించాలని తెలిపారు. పాత దుస్తులను బయట పడేయకుండా, వాటిని తిరిగి ఉపయోగించుకోవాలని లేదా ఇతర అవసరాలకు వినియోగించాలని విద్యార్థులకు సూచించారు. తగ్గించడం, పునర్వినియోగం, పునరుత్పత్తి ( రెడ్యూస్ రివ్యూ రీసైకిల్) అనే సూత్రాలను పాటించాలని సూచించారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు తమ ఇళ్లలో పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించా లని ప్రిన్సిపాల్ శారద సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరిశుభ్రమైన,పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సామర్లకోట రైల్వే స్టేషన్లో స్వచ్ఛతా హి సేవా



**సామర్లకోట.... పెన్. పవర్.. సెప్టెంబర్..17...** సామర్లకోట రైల్వే స్టేషన్లో సూపరింటెండెంట్ రమేశ్ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం జరిగింది. ప్రజలు, ప్రయాణికులు స్వచ్ఛ సంకల్పానికి సహకరించాలని ఆయన కోరారు. రైల్వే అధికారులు, సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అక్టోబర్ 15 వరకు రైల్వే స్టేషన్లో స్వచ్ఛత మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు రమేశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

**మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత.**




**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 17:**పొలంబడిని రైతులు సద్వినియోగం చేసుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత అన్నారు ప్రత్తిపాడు మండలంలోని ఏలూరు గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి జోకా అమృత ఆధ్వర్యంలో గురువారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి చార్టుల ప్రదర్శన ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే విధానాలను రైతులకు వివరించారు.పంటలను శాస్త్రీయంగా పరిశీలించి పంటలకు మేలు చేసే మిత్రపురుగులు,నష్టం కలిగించే శత్రుపురుగులను గుర్తించే విధానాన్ని వివరించారు.ప్రకృతి సిద్ధమైన ద్రావణాలు, కషాయాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.ముఖ్యంగా వరి పంటలో తెల్లదోమ,పచ్చదోమ,ఎర్రనల్లి నివారణతోపాటు మొక్కలకు పొటాష్ పోషకాలు అందించేందుకు జిల్లేడు ద్రావణం ఉపయోగపడుతుందని తెలిపారు.జిల్లేడు ఆకులను మెత్తగా రుబ్బి నీరు,ఆవు మూత్రంతో 48 గంటలు నానబెట్టి వడపోసి,అనంతరం నిర్ణీత మోతాదులో నీటిలో కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని సూచించారు.రసాయన పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి సిద్ధమైన ద్రావణాలు,కషాయాలను వినియోగించడం ద్వారా మిత్రపురుగులను సంరక్షించడంతోపాటు సాగు ఖర్చును తగ్గించుకోవచ్చని,తద్వారా నాణ్యమైన దిగుబడిని పొందవచ్చని వ్యవసాయ అధికారిని జోకా అమృత వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు,వ్యవసాయ శాఖ సిబ్బంది అర్జున్,వరహాలు,మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## మోడీతోనే దేశం అన్ని రంగాల్లోను అభివృద్ధి.

-మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** ప్రధానమంత్రి నరేంద్రమోడీతోనే దేశం అన్ని రంగాల్లోను అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని కిర్లంపూడి మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు శరకణం రాజబాబు అన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోడీ జన్మదినోత్సవం సందర్భంగా కాకినాడ జిల్లా మండల కేంద్రమైన కిర్లంపూడి గ్రామం సంత మార్కెట్ లో వేంచేసియున్న శ్రీ లక్ష్మి గణపతి ఆలయంలో కిర్లంపూడి మండలం బిజెపి పార్టీ అధ్యక్షులు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు.ఆలయ అర్చకులు బాదంపూడి ప్రసాద్ శర్మ వేద మంత్రోచ్చరణల మధ్య నిర్వహించిన ఈ పూజా కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బుద్ధ పెద్దకాపు, మండల ఓబిసి అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ, మండల కార్యదర్శి కోలా కృష్ణ, విజ్ఞాన భారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ గాడి శ్రీనివాసరావు, పాండురంగ మాస్టర్, గంధం దుర్గాప్రసాద్, గంధం మల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

## మోదీ దీర్ఘాయుష్షు కోసం ఆశీర్వాద దీపం వెలిగించిన: ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, సెప్టెంబరు 17:** భారత ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని గురువారం కొత్తపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తన స్వగృహం వద్ద ఆశీర్వాద దీపాన్ని వెలిగించి ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా నిలిపేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం మరింత శక్తిసామర్థ్యాలతో పనిచేసేలా భగవంతుడు ప్రధాని మోదీకి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఆదిత్య ఐ టి విభాగం లో విజ్ఞానదాయకంగా ముగిసిన గెస్ట్ లెక్చర్



**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 17:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో, సీఎస్ఐ విద్యార్థి విభాగం సహకారంతో "ఎక్స్ఆర్ ఎస్సెన్షియల్స్ -- డిజైన్ మరియు ఇంటరాక్షన్ భవిష్యత్తు" అనే అంశంపై గెస్ట్ లెక్చర్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు డేటా సైన్స్ విభాగాలకు చెందిన మూడవ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.ఈ గెస్ట్ లెక్చర్‌లో ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఎక్స్ఆర్) యొక్క ప్రాథమిక అంశాలు, ఆధునిక డిజైన్ మరియు డిజిటల్ పరస్పర చర్యల్లో దాని ప్రాధాన్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్), మిక్స్‌డ్ రియాలిటీ (ఎంఆర్) వంటి సాంకేతికతల గురించి, వాటి వాస్తవ ప్రపంచ అనువర్తనాల గురించి వివరించారు. ఈ సాంకేతికతలు వినియోగదారులకు మరింత ఆకర్షణీయమైన, పరస్పర చర్యలతో కూడిన అనుభవాలను అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సదస్సులో నిపుణులు మాట్లాడుతూ, భవిష్యత్తులో డిజైన్ మరియు డిజిటల్ పరస్పర చర్యల రంగాల్లో ఎక్స్ఆర్ సాంకేతికతలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, మిక్స్‌డ్ రియాలిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎక్స్ఆర్ రంగంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ధోరణులు, వివిధ పరిశ్రమల్లో వాటి వినియోగం, భవిష్యత్‌లో అందుబాటులోకి వచ్చే కెరీర్ అవకాశాలపై కూడా వివరించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు తమ సందేహాలను నిపుణులను అడిగి, ఎక్స్ఆర్ సాంకేతికతల వినియోగం, అభివృద్ధి మరియు కెరీర్ అవకాశాలపై విలువైన సూచనలు పొందారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, భవిష్యత్ సాంకేతిక రంగాల్లో అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడింది. ఈ కార్యక్రమానికి ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ గ డాక్టర్ ఐ వీరాంజనేయులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకాడెమిక్స్) డాక్టర్ ఎస్ రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజనీరింగ్, సైన్సెస్) డాక్టర్ ఎ రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి సురేష్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం వి రాజేష్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ మాకినీడి రాజాబాబు, డిప్యూటీ హెడ్స్ డాక్టర్ ఏ లక్ష్మణ రావు, ఎస్ నీలిమ మరియు విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యతోనే అభివృద్ధి సాధ్యం











పీసీసీ బహుమతి ప్రధానోత్సవ సభలో వక్తలు

**పెద్దాపురం... పెన్ పవర్... సెప్టెంబర్.. .. 17..** విద్య ద్వారానే సమాజ అభివృద్ధి, మానవుల అభివృద్ధి జరుగుతుందని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు జ్యోసుల కృష్ణబాబు అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్య ఆవశ్యకత అనే అంశం పై పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల బహుమతి ప్రధానోత్సవ సభ పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనం లో పీసీసీ అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధులుగా చేనేత సొసైటీ అధ్యక్షులు ముప్పన వీర్రాజు, పెద్దాపురం - సామర్లకోట రోటరీ కార్యదర్శి బి ఆంజనేయులు, గంగాధరుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ విద్యార్థుల్లో సామజిక అవగాహనా, విద్యపట్ల బాధ్యత పెంచడానికి పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ కృషి చేస్తుందని అన్నారు. సమాజం లో విద్యకు చాలా ప్రాధాన్యత ఉందని తెలిపారు. సమాజం లో జరిగే ప్రతీ మార్పు విద్యతోనే అని మనము గుర్తించాలని తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ పెద్దాపురం - సామర్లకోట వారి సహకారం తో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ సభ్యులు మంజుల స్వాగతం పలుకగా, నెక్కల అనూష వందన సమర్పణ చేసారు. కార్యక్రమం లో పీసీసీ సభ్యులు వానపల్లి సాయి, తేజా, ఎన్. జిస్విత, కె పవన్ కుమార్, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





**సామర్లకోట.. పెన్ పవర్.. సెప్టెంబర్.. 17..**సామర్లకోట పట్టణ శివారు సత్యనారాయణపురంలో సుమారు రెండు నెలల నుండి డ్రైనేజీ నుండి పూడికతీత చేపట్టకపోవడంతో దుర్వాసన వస్తుందని, ఈ కారణంగా పెద్ద ఎత్తున దోమలు వ్యాపించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం జరుగుతుందని సంబంధిత ప్రాంత ప్రజలు వాపోయారు. రెండు నెలల నుండి మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన డ్రైనేజీల్లో పూడిక తొలగించే పనులు చేపట్టలేదని వారు పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని నీ సందర్భంగా వారు కోరారు.

## భారత ప్రధాని పుట్టినరోజు సందర్భంగా....



**బిజెపి శ్రేణులు సేవా కార్యక్రమాలు.**

**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర దామోదర్ దాస్ మోడీ పుట్టినరోజు సందర్భంగా బిజెపి శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు గురువారం నిర్వహించాయి. వారం రోజులపాటు నిర్వహించ తలపెట్టిన మోడీ జన్మదినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులందరికీ రొట్టెలు, పాలు, పళ్ళు పంచిపెట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా బిజెపి శ్రేణులు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం రూరల్ బిజెపి అధ్యక్షుడు నీలి సురేష్, బిజెపి పట్టణ అధ్యక్షులుపైల అయ్యప్ప, ఏలేశ్వరం రూరల్ మండల పూర్వ అధ్యక్షుడు కూరాకుల రాజా, సీనియర్ నాయకులు వెలుగూరి హరే రామ్, గొడుగు నల్లబ్బాయి, కర్రోతు జానకి రామయ్య, కోరాడ రాము, బూర్లు వాసు, జగతా శ్రీరామ్, చింతల అబ్బులు, రౌతు శ్రీను , అప్పన్న పాలెం శివ తదితరులు పాల్గొన్నారు.

## భారత ప్రధాని నరేంద్ర మోడీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలి

**మోదీ జన్మదినం సందర్భంగా ఆశీర్వాద దీపం వెలిగించిన ఎమ్మెల్యే సత్యప్రభ**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 17:** భారత ప్రధాని నరేంద్ర మోడీ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభరాజా అన్నారు.దేశ ప్రజా సేవలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతగా,ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా దీపం వెలిగించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభరాజా మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.గత 25 ఏళ్లుగా ప్రజా జీవితంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ దేశ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ 'ఆశీర్వాద్ కా దియా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రధాని మోదీకి ఆయురారోగ్యాలు,సంపూర్ణ ఆరోగ్యం,మరింత శక్తిని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించినట్లు ఆమె పేర్కొన్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# ఐదు రోజుల విద్యుత్ అంతరాయం.. సబ్‌స్టేషన్ ముట్టడి!






- గృహ అవసరాలతో పాటు వ్యవసాయ బోర్లకూ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆందోళన
- సింగారంపాలెం సబ్‌స్టేషన్ వద్ద రామయ్యపాలెం గ్రామస్థుల నిరసన

**గండేపల్లి,పెన్ పవర్, సెప్టెంబర్ 17:**గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామంలో ఐదు రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో గ్రామస్థులు గురువారం సింగారంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. గృహ అవసరాలతో పాటు వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. గ్రామంలో గత ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోతోందని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎక్కువగా ఉంటున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ అందక సాగు పనులపై కూడా ప్రభావం పడుతోందని రైతులు తెలిపారు.సమస్యను స్థానిక విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని గ్రామస్థులు తెలిపారు. తమ గ్రామానికి సమీపంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నప్పటికీ సరఫరాలో అంతరాయం కొనసాగడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సింగారంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ యు.వి. శివనాగబాబు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమన్వయం చేయడంతో ఆందోళన సద్దుమణిగింది. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి గల కారణాలను అధికారులు పరిశీలించి, గృహ, వ్యవసాయ అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని రామయ్యపాలెం గ్రామస్థులు కోరుతున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు దీటుగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి.

-ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు.





**పెన్ పవర్, సెప్టెంబర్ 17:**రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు దీటుగా ఎదుర్కోవడానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు.ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు వాసిరెడ్డి జమీల్ గొల్లు చిన దివాణం , వాసిరెడ్డి భాస్కర్ బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ములగపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతోపాటు ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ గుడాల వెంకటరత్నం ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నుండి పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రత్తిపాడు మండలం చింతలూరు వైసిపి నాయకులు బొడ్డు సూరిబాబు ఆధ్వర్యంలో పలువురు వైసిపి ముఖ్య నాయకులు అన్నవరం నుండి పలువురు వైసిపి ముఖ్య నాయకులు గురువారం కిర్లంపూడి ముద్రగడ నివాసంలో ముద్రగడ గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.మాజీ మంత్రి, సీనియర్ నాయకులు ముద్రగడ పద్మనాభం మరణంతో తీవ్ర విషాదంలో ఉన్న గిరిబాబుకు వైసిపి నాయకులు తమ తీవ్ర ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.ఈ కష్టసమయంలో పార్టీ కార్యకర్తలకు ఆసరాగా నిలిచేందుకు త్వరలోనే నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత పర్యటనలు ప్రారంభించి, అందరికీ అందుబాటులో ఉండాలని పలువురు వైసిపి నాయకులు గిరిబాబుకు విజ్ఞప్తి చేశారు.దీంతో గిరిబాబు స్పందిస్తూ నియోజకవర్గంలో వైసిపి నాయకులకు, కార్యక్రర్తలకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడమే కాకుండా,గ్రామాల్లో త్వరలోనే విస్తృతంగా పర్యటిస్తానని తెలియజేసారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి బలపరచిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.

## రెండో రోజుకు చేరుకున్న వీఆర్‌ఏల సహాయ నిరాకరణ సమ్మె.



**ఏలేశ్వరం, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ తాసిల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏలు చేపట్టిన సహాయ నిరాకరణ సమ్మె గురువారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు చేపట్టిన సమ్మెలో పలు నినాదాలు చేశారు. వీఆర్ఏలకు జీతాలు పెంచాలని, టి.ఎ, డి. ఎ ఇవ్వాలని, అర్హులకు విఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సహాయ నిరాకరణ సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు షేక్ దాదాసాహెబ్, కొత్తపల్లి సత్యనారాయణ, షేక్ కన్నాసాహెబ్, జాజిమొగ్గల సత్యనారాయణ, కొల్లు కుమార్, చల్లగాని అచ్చిరాజు, వేమగిరి అర్జమ్మ, పొట్లాడా రమేష్, అమలాపు చందర్రావు, ఊర రమేష్ రావులతో పాటు 20 మంది వీఆర్ఏలు సమ్మెలో పాల్గొన్నారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు





-మానవత్వం చాటుకున్న వివేకానంద సేవా సమితి సభ్యులు.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, సెప్టెంబర్, 17:**అనాథగా మృతి చెందిన వ్యక్తికి వివేకానంద సేవా సమితి సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు.ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో అనాథ వ్యక్తి మృతి చెందిన విషయం వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావుకు తెలియడంతో ఆయన ఆధ్వర్యంలో సమితి సభ్యులు స్పందించారు.ఏలేశ్వరం మండలం చిన్నింపేట గ్రామం సమీపంలోని జాతీయ రహదారి పక్కన సీపీఎం కర్మాగారం వద్ద మూడు రోజుల క్రితం అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని స్థానికులు గుర్తించి వెంటనే జాతీయ రహదారి అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అతడిని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.మృతుడి వివరాలు,బంధువుల ఆచూకీ కోసం పోలీసులు మూడు రోజులపాటు సామాజిక మాధ్యమాలు,వాట్సప్ గ్రూపుల ద్వారా సమాచారం అందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదు. దీంతో వివేకానంద సేవా సమితి సభ్యులు ముందుకు వచ్చారు.పోలీసు,పంచాయతీ సిబ్బంది సహకారంతో గురువారం ప్రత్తిపాడు స్మశానవాటికలో మృతదేహాన్ని ఖననం చేశారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పాండ్రంకి రామకృష్ణ,కానిస్టేబుల్ కాళీ, వివేకానంద సేవా సమితి సభ్యులు అడపా శివప్రసాద్,దాసరి కృష్ణ, మూరా రాజశేఖర్,శాలా మల్లికార్జునరావు, పంచాయతీ సిబ్బంది వాసా చిన్నారావు,వాతాడ మల్లేష్,మూరా ప్రసాదరావు,మూరా రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఇర్రిపాకలో దీపోత్సవం





**జగ్గంపేట, పెన్ పవర్, సెప్టెంబర్ 17:** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జగ్గంపేట నియోజకవర్గంలో భారీ వేడుకలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు జగ్గంపేట నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, బిజెపి కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణ వర్మ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఏలేరు నది తీరాన ఉన్న శివ కేశవుల క్షేత్రం వద్ద వెయ్యి దీపాలతో మహా దీపోత్సవం నిర్వహించి శివ కేశవులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001 నుండి ఇప్పటివరకు 25 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా ఏకధాటిగా కొనసాగుతూ దేశ ప్రజల సంక్షేమం కోసం, భారతదేశ అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తున్న నరేంద్ర మోదీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని కోరుకున్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు దూసుకుపోతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు



**పెద్దాపురం... పెన్ పవర్... సెప్టెంబర్..17..**భారత ప్రధాని నరేంద్ర మోడీ కి భగవంతుడు నిండు నూరేళ్ల ఆయుష్షు ప్రసాదించి, దేశానికి మరింత కాలం సేవ చేసే శక్తిని అందించాలని కోరుకున్నట్లు కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు తెలిపారు.గురువారం సామర్లకోట పట్టణంలోని గడియార స్తంభం వద్ద బీజేపీ సామర్లకోట పట్టణ నాయకుల ఆధ్వర్యంలో "ప్రజాసేవలో 26 సంవత్సరాలు" కార్యక్రమంలో భాగంగా ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని "ఆశీర్వాద దీపం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీపాలంకరణతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. మోడీ గారి పరిపాలన సమర్థవంతంగా, దేశ ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ కొనసాగుతోందని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తూ, సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తోందని పేర్కొన్నారు.రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రజలకు మెరుగైన పాలన, సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సామర్లకోట పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు దొమ్మేటి శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, బీజేపీ పట్టణ అధ్యక్షులు పుప్పాల గోవిందు, అడబాల కుమారస్వామి, మంచం సాయిబాబు, తుమ్మల ప్రసాద్, మోటూరి నాగేష్, మడగల శ్యామ్ కుమార్, అత్తిలి కృష్ణ, పెంకే వెంకటలక్ష్మి, ఏడుకొండలు, ఏలేటి రమేష్, జట్ల సాయి, దేశెట్టి శ్రీనివాస్, కాటంరెడ్డి రాజా, బొందల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపాలెం ఏటీఎం చోరీ కేసు ఛేదింపు.. నిందితుడి అరెస్టు

- రూ.4.35 లక్షల నగదు, సెల్‌ఫోన్ చోరీ..
- రూ.2.96 లక్షలు, సెల్‌ఫోన్ స్వాధీనం



**కాజులూరు, పెన్‌పవర్, సెప్టెంబర్ 17:**కాజులూరు మండలం గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏటీఎంను ధ్వంసం చేసి రూ.4.35 లక్షల నగదు, సెల్‌ఫోన్ చోరీ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. కేసులో నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.2.96 లక్షల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.ఎస్. చైతన్యకృష్ణ గురువారం వెల్లడించారు.కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 5 నుంచి 7వ తేదీ మధ్య గొల్లపాలెంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, ఏటీఎం తాళాలను పగులగొట్టి నిందితుడు చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రూ.4,35,000 నగదు, ఒక సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. దీనిపై క్రైం నంబర్ 128/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 331(4), 305(ఎ) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### సాంకేతిక ఆధారాలతో గుర్తింపు

దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించి నిందితుడి కదలికలను గుర్తించారు. కాజులూరు మండలం అంద్రంగి గ్రామానికి చెందిన సమనాసి గొల్లయ్య (50), సోమయ్య కుమారుడిగా గుర్తించి సెప్టెంబర్ 16న అతని ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.2,96,000 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అతనిపై గతంలోనూ పలు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

### పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

కేసును సమర్థవంతంగా ఛేదించిన కాకినాడ రూరల్ సీఐ డి.ఎస్. చైతన్యకృష్ణ, కాకినాడ క్రైం సీఐ పి. వెంకట త్రినాథ్, ఫింగర్‌ప్రింట్ సీఐ పి. శ్రీనివాసరావు, గొల్లపాలెం ఎస్ఐ ఆర్.వి.ఎన్. మూర్తి, ఏఎస్ఐలు బ్రహ్మాజీ, గోవిందు, ఎం.వి.వి.డి. ప్రసాద్, హెచ్‌సీలు నారాయణరెడ్డి,జి. నరసింగరావు, కానిస్టేబుళ్లు ఆర్. ఫణీంద్ర, ఏ. చంద్రశేఖర్, ఎం. శివప్రసాద్, కె. వెంకటరత్నంలను ఎస్పీ జి. బిందుమాధవ్ అభినందించారు.

# మూడో టీ20 మ్యాచ్‌లోనూ వైభవ్ సూర్యవంశీకి దక్కని చోటు!

- టీమిండియా, ఆఫ్ఘనిస్థాన్ మధ్య మూడో టీ20
- టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆఫ్ఘన్
- ఇప్పటికే సిరీస్ గెలిచిన టీమిండియా
- ఢిల్లీలో నామమాత్రపు మ్యాచ్
- మరోసారి వైభవ్ సూర్యవంశీ రిజర్వ్ బెంచ్ కే పరిమితం



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా చివరిదైన మూడో మ్యాచ్ ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరుగుతోంది. ఈ నామమాత్రపు మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆఫ్ఘన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని టీమిండియా మొదట బ్యాటింగ్ చేయనుంది. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లలో ఘన విజయం సాధించిన భారత్, 2-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి ఆఫ్ఘన్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని పట్టుదలగా ఉంది. కాగా, టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఈ మ్యాచ్ లోనూ తుదిజట్టులో చోటు లభించలేదు. తొలి రెండు మ్యాచ్ లలో అతడ్ని ఆడించకపోడంతో, చివరిదైన నేటి నామమాత్రపు మ్యాచ్ లోనైనా అవకాశం ఇస్తారని భావించారు. కానీ టీమ్ మేనేజ్ మెంట్ జట్టు కూర్పును మార్చేందుకు ఇష్టపడకపోవడంతో ఈ టీనేజర్ రిజర్వ్ బెంచ్ కే పరిమితమయ్యాడు.కాగా, టాస్ గెలిచిన అనంతరం ఆఫ్ఘన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ మాట్లాడుతూ.. "గత రెండు మ్యాచ్‌ల్లోనూ మేం టాస్ గెలిస్తే బౌలింగే ఎంచుకోవాలనుకున్నాం, కానీ దురదృష్టవశాత్తూ టాస్ ఓడిపోయాం. ఈ పిచ్ బౌలర్లకు అనుకూలంగా కనిపిస్తోంది. మా బౌలింగ్ ప్రణాళికలను కచ్చితంగా అమలు చేస్తామని నమ్ముతున్నాం. భారత బ్యాటర్లపై ఒత్తిడి పెంచి, వారిని భారీ స్కోరు చేయకుండా కట్టడి చేయడమే మా లక్ష్యం. సిరీస్ ఓడిపోయినప్పటికీ, గత మ్యాచ్‌లలో చేసిన తప్పులను సమీక్షించుకున్నాం. ఈ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేసి విజయంతో సిరీస్‌ను ముగించాలనుకుంటున్నాం" అని తెలిపాడు. జట్టులో రెండు మార్పులు చేసినట్లు, గుల్బాదిన్ నైబ్, నూర్ అహ్మద్ స్థానంలో అబ్దుల్లా అహ్మద్జాయ్, నూర్ ఉల్ రహ్మాన్ ఆడుతున్నారని చెప్పాడు.భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ, "మేము టాస్ గెలిచినా మొదట బ్యాటింగ్ చేయాలనే అనుకున్నాం. ఇది మాకు ఒక మంచి సవాల్‌గా భావిస్తున్నాం. పరిస్థితులను సంక్లిష్టం చేసుకోకుండా, ప్రశాంతంగా ఆడటం ముఖ్యం" అని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్ కోసం తుది జట్టులో ఒక మార్పు చేసినట్లు, అర్ష్‌దీప్ సింగ్ స్థానంలో యశ్ ఠాకూర్ ఆడుతున్నాడని వివరించాడు.

**తుది జట్లు:**

భారత్: సంజూ శాంసన్(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, యశ్ ఠాకూర్, జస్ప్రీత్ బుమ్రా.ఆఫ్ఘనిస్థాన్: ఇబ్రహీం జద్రాన్(కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్(వికెట్ కీపర్), సెదిఖుల్లా అటల్, అబ్దుల్లా అహ్మద్జాయ్, దర్విష్ రసూలీ, నూర్ ఉల్ రహ్మాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహమ్మద్ నబీ, రషీద్ ఖాన్, ముజీబ్ ఉర్ రహ్మాన్, ఫజల్‌హక్ ఫరూఖీ.

# విధ్వంసం సృష్టించిన అభిషేక్ శర్మ.. 30 బంతుల్లోనే సెంచరీ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా విరుచుకుపడ్డాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న మూడో టీ20లో బంతిని నలుమూలలా బాదుతూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆఫ్ఘన్ బౌలర్లపై విరుచుకుపడిన అభిషేక్, టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే కళ్లు చెదిరే రేంజ్‌లో రికార్డు సెంచరీ నమోదు చేశాడు.

**30 బంతుల్లోనే వంద.. వరల్డ్ రికార్డ్ బద్దలు:**
మ్యాచ్ ఆరంభం నుంచే మోత మోగించిన అభిషేక్ శర్మ, ఆఫ్ఘనిస్థాన్ జట్టు బౌలర్లకు ఏమాత్రం కోలుకునే అవకాశం ఇవ్వలేదు. ఈ క్రమంలో కేవలం 30 బంతుల్లోనే 100 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఇక తన ఇన్నింగ్స్‌లో ఏకంగా 9 భారీ సిక్సర్లు, 10 ఫోర్లతో గ్రౌండ్ అంతటా బౌండరీల సునామీ సృష్టించాడు.

**ఐసీసీ ఫుల్ మెంబర్స్ హిస్టరీలోనే ఫాస్టెస్ట్ సెంచరీ:**
ఈ విధ్వంసంతో అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అభిషేక్ శర్మ సరికొత్త ఆల్-టైమ్ రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఐసీసీ ఫుల్ మెంబర్ (పర్మనెంట్) జట్ల తరఫున టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ (ఫ్టుర్‌వర్ జవత్‌బతీఎ) నమోదు చేసిన బ్యాటర్‌గా అభిషేక్ ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. కాగా ఈ రికార్డు ఇప్పటి వరకు న్యూజిలాండ్ ప్లేయర్ ఆలెన్ (33 బంతుల్లో 100 పరుగులు) పేరుపై ఉండేది. కాగా ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లని చెడుగుడు ఆడుతూ అభిషేక్ చేసిన ఈ ఇన్‌సేన్ రాంపేజ్‌తో ఢిల్లీ స్టేడియం ఊగిపోయింది.

# వెస్టిండీస్‌తో భారత్ స్ట్రాంగెస్ట్ ప్లేయింగ్ XI ఇదే: మరీ ఆకిబ్ నబీకి గిల్ ఛాన్స్ దక్కేనా?




**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్ వేటలో భాగంగా వెస్టిండీస్‌తో జరిగబోయే మూడు మ్యాచ్‌ల సిరీస్‌కు బీసీసీఐ బలమైన భారత స్క్వాడ్‌ను ప్రకటించింది. కెప్టెన్ శు భ్మన్ గిల్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీమిండియాలో సీనియర్లు రీఎంట్రీ ఇవ్వగా, ఆసియా గేమ్స్ కారణంగా కొందరు స్టార్లకు స్థానం చోటు మాత్రం దక్కలేదు.

**హిట్‌మ్యాన్-కింగ్ ఈజ్ బ్యాక్:**
రోహిత్ కమ్‌బ్యాక్: లార్డ్స్ వన్డేలో అద్భుతమైన సెంచరీతో వన్డేల్లో తన సత్తా ఏంటో నిరూపించిన రోహిత్, యశస్వి జైస్వాల్‌ను పక్కన పెట్టి గిల్‌తో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు.

విరాట్ కోహ్లీ రాంపేజ్: వన్డే ఫార్మాట్ కింగ్ విరాట్ కోహ్లీ నంబర్-3లో దిగి విండీస్ బౌలర్లపై దండయాత్రకు రెడీ అయ్యాడు. గిల్, రోహిత్, కోహ్లీల టాప్ ఆర్డర్ భారత్‌కు కొండంత బలాన్ని ఇస్తోంది.

**శ్రేయస్ ఔట్.. రుతురాజ్ ఇన్:**
ఆసియా గేమ్స్ ఎఫెక్ట్: ఆసియా గేమ్స్ 2026 టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండటంతో, అతడు ఈ వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ఇషాన్ కిషన్ కూడా ఆసియా గేమ్స్ బరిలోనే ఉన్నాడు.

లి రుతురాజ్ గోల్డెన్ ఛాన్స్: శ్రేయస్ లేకపోవడంతో మిడిల్ ఆర్డర్‌లో నంబర్-4 స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌కు బంఫర్ ఆఫర్ దక్కింది.

కీపర్‌గా కేఎల్ రాహుల్: మిడిల్ ఆర్డర్ లో జట్టుకు వెన్నుముక నిలిచిన కేఎల్ రాహుల్ ఫస్ట్ ఛాయిస్ వికెట్ కీపర్‌గా రాబోతుండగా, ధ్రువ్ జురెల్ బ్యాకప్‌గా ఎంపికయ్యాడు.

**హార్దిక్ లేకపోవడంతో నితీష్‌కే ప్రాధాన్యత:**
నితీష్ రెడ్డి హవా: ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయంతో జట్టుకు దూరమవ్వడంతో ఆంధ్రా కుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి వన్డేల్లోనూ తన స్థానాన్ని ఖరారు చేసుకున్నాడు.

జడేజాకు లాస్ట్ ఛాన్స్: గత కొన్ని మ్యాచ్‌లుగా ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా మరోసారి తన ఫామ్ నిరూపించుకోవడానికి దక్కిన గోల్డెన్ ఛాన్స్.

**బుమ్రా లేకున్నా బౌలింగ్ పవర్ ఫుల్:**
ఆకిబ్ నబీ, నమన్ ధీర్ సర్ ప్రైజ్: లిస్ట్-ఏ క్రికెట్‌లో 56 వికెట్లతో పాటు 111 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయగల జమ్మూ కాశ్మీర్ స్టార్ ఆల్‌రౌండర్ ఆకిబ్ నబీతో పాటు నమన్ ధీర్‌లు తొలిసారి భారత వన్డే జట్టుకు ఎంపికయ్యారు.

సిరాజ్ లీడర్‌షిప్: బుమ్రా గైర్హాజరీలో మహమ్మద్ సిరాజ్ పేస్ దళాన్ని నడిపించనుండగా, ప్రసిద్ధ్ కృష్ణ రెండో పేసర్‌గా బరిలోకి దిగనున్నాడు. ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఫిక్స్.

**భారత్ జట్టు అంచనా:**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ఆకిబ్ నబీ, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ.

# సీనియర్లకు డార్లింగ్ లైన్ క్లియర్ చేసినట్లే!

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద పండుగ సీజన్ వచ్చిందంటే? బడా హీరోల సినిమాల విడుదల తేదీల పోటీ ఊపందుకుంటుంది. ముఖ్యంగా సంక్రాంతి బరిలో దిగేందుకు హీరోలంతా ఆసక్తి చూపిస్తారు. అయితే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తోన్న తాజా చిత్రం -ఫౌజీ- విడుదలపై ఫిలింనగర్ వర్గాల్లో ఆసక్తికర ప్రచారం సాగుతోంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి రేసులో కాకుండా జనవరి 26న గణతంత్ర దినోత్సవ కానుకగా విడుదల చేయడానికి చిత్రబృందం సమాయత్తమవుతోందనే వార్త హాట్ టాపిక్‌గా మారింది. ఈ నిర్ణయంతో సీనియర్ హీరోలకు సంక్రాంతి లైన్ క్లియర్ అయినట్లేనని చెప్పొచ్చు. పరిశ్రమలో సీనియర్ నటులపట్ల గౌరవం, మర్యాదలు ప్రదర్శించడంలో ప్రభాస్ ఎప్పుడూ ముందుంటారు. అందుకే ఆయన్ని అంతా ఆప్యాయంగా డార్లింగ్ అని పిలుచుకుంటారు. గతంలో కూడా పలు సందర్భాల్లో సీనియర్ హీరోల సినిమాలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో తన చిత్రాల విడుదల తేదీలను సర్దుబాటు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. సీనియర్ల పట్ల తనకున్న అభిమానాన్ని మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపుతానని ప్రభాస్ మరోసారి నిరూపిస్తున్నారు. పోటీ వాతావరణాన్ని నివారించి అందరి సినిమాలకూ మంచి థియేటర్లు లభించాలనే ఆలోచనతో డార్లింగ్ తీసుకుంటున్న నిర్ణయం పరిశ్రమలో ప్రశంసలు అందుకుంటోంది. తెలుగు పరిశ్రమకు సంక్రాంతి అనేది అత్యంత లాభదాయకమైన సీజన్. ఈ సమయంలో చిరంజీవి, బాలకృష్ణ








వంటి అగ్ర సీనియర్ హీరోల సినిమాలు విడుదల కావడం ఆనవాయితీగా వస్తోంది. ఇలాంటి సమయంలో ప్రభాస్ లాంటి భారీ పాన్ ఇండియా స్టార్ సినిమా సంక్రాంతి బరిలో ఉంటే థియేటర్ల కేటాయింపు, కలెక్షన్ల విభజన విషయంలో తీవ్ర పోటీ నెలకొంటుంది. -ఫౌజీ- వంటి భారీ ప్రాజెక్ట్ పండుగ రేసు నుంచి ఎగ్జిట్ అయి జనవరి 26కు షిఫ్ట్ అవ్వడం వల్ల సీనియర్ హీరోల సినిమాలకు కావాల్సినంత స్పేస్ లభించడమే కాకుండా వసూళ్ల పరంగా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇదే సీజన్ లో యంగ్ హీరోల సినిమాలు కూడా పరిమితంగా రిలీజ్ అవుతంఆయి. వారికి కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. సీనియర్ హీరోల సినిమాలకు టికెట్ దొరకని అభిమానులు చిన్న సినిమాలను ఆదరించే అవకాశం ఉంటుంది. కంటెంట్ బాగుంటే గనుక సీనియర్లను మంచిని విజయాలు చిన్న సినిమాలు సాధిస్తోన్న సంగతి తెలిసిందే.-ఫౌజీ- చిత్ర కథాంశం దేశభక్తి నేపథ్యంతో కూడుకున్నదనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు జనవరి 26 (రిపబ్లిక్ డే) వీకెండ్ సరైన వేదికగా నిలుస్తుందని చెప్పొచ్చు. పండుగ హడావుడి ముగిసిన వెంటనే సోలో రిలీజ్ అడ్వాంటేజ్ సాధించడానికి ఈ ప్లాన్ ఉపకరిస్తుంది. కథకు సరిపోయే సరైన తేదీని ఎంచుకోవడంతో పాటు పరిశ్రమ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవడం డార్లింగ్ వ్యక్తిత్వానికి నిదర్శనం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com